నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మూసాపేట: మూసాపేట 11 కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఈనెల 17న విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ భీమ లింగప్ప గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మూసాపేట, వార్డు కార్యాలయం , గూడ్స్ షెడ్ రోడ్డు, యాదవబస్తీ, అంబేడ్కర్ నగర్, ఎస్‌సీనగర్, జేపీనగర్, గూడ్స్ షెడ్ రోడ్డు పార్కింగ్ లైన్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

ఎరుకల సంఘం ఆధ్వర్యంలో ‘అలయ్.. బలయ్’



ఎమ్మెల్యే కృష్ణారావును సన్మానిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు రాములు

కూకట్‌పల్లి: తెలంగాణ రాష్ట్ర ఎరుకల సంఘం ఆధ్వర్యంలో సంఘం ఆత్మగౌరవ భవనంలో గురువారం ‘అలయ్ బలయ్’ నిర్వహించారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎరుకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాములు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సన్మానించారు. అన్ని రంగాల వారిని ఆహ్వానించి సత్కరించడం అభినందనీయమని కృష్ణారావు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎరుకల సంఘం రాష్ట్ర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

కూకట్‌పల్లి: అల్లాపూర్ డివిజన్‌కు చెందిన ఎస్. చంద్రకళకు సీఎంఆర్‌ఎఫ్ కింద రూ. 2 లక్షల ఆర్థిక సాయం మంజూరైంది. కాగా సంబంధిత ఎల్‌ఓసీ పత్రాలను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు క్యాంపు కార్యాలయంలో ఆమె భర్త ఎన్. రంగాచారికి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొంది బిల్లులు చెల్లించలేని నిరుపేదలు ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకుంటే ఆర్థిక సాయం మంజూరవుతుందన్నారు.

30న వేలం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి గ్రామంలోని సీతారామచంద్ర స్వామి దేవస్థానం, రామలింగేశ్వర స్వామి దేవస్థానం (పాత శివాలయం)లో కొబ్బరికాయలు, పూలు, పూజ సామగ్రి విక్రయించేందుకు ఈనెల 30న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి కే. అంజయ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 11 గంటలకు రామాలయం ప్రాంగణంలో వేలం ఉంటుందని, కాల పరిమితి 19వ తేదీ 2025 నుంచి 18వ తేదీ నవంబర్ 2026 వరకు హక్కు కలిగి ఉంటారని తెలిపారు. రూ. 30 వేల డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని, మరిన్ని వివరాలకు ఆలయంలో సంప్రదించాలని ఆయన సూచించారు.

యూజీసీ పే స్కేల్స్ అమలు చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకులు

లాలాపేట: విశ్వవిద్యాలయాల్లోని కాంట్రాక్ట్ అధ్యాపకులందరికీ వెంటనే యూజీసీ పే స్కేల్స్ అమలు చేయాలని విశ్వవిద్యాలయాల కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం స్టేట్ కోఆర్డినేషన్ కమిటీ డిమాండ్ చేసింది. గురువారం ఓయూ ఆర్ట్స్ కళాశాల వద్ద అధ్యాపకులు మాట్లాడుతూ.. తెలంగాణలోని 12 యూనివర్సిటీల్లో ఏళ్ల నుంచి కాంట్రాక్ట్ అధ్యాపకులు బోధనతో పాటు అడ్మినిస్ట్రేషన్ బాధ్యతలను సైతం నిర్వహిస్తున్నామన్నారు. 5 నెలల క్రితం సీఎం రేవంత్‌రెడ్డి కాంట్రాక్ట్ అధ్యాపకులందరికీ యూజీసీ వేతనాలను వర్తింపజేయాలని ఆదేశించినా ఇప్పటి వరకు అధికారులు అమలు చేయకపోవడం శోచనీయం అన్నారు. కాంట్రాక్ట్ అధ్యాపకులకు యూజీసీ వేతనాలు వర్తింపజేయకుండా అధ్యాపకుల నియామక ప్రక్రియ ప్రారంభిస్తే సహించేది లేదన్నారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించిన తర్వాతే నియామక ప్రక్రియ చేపట్టాలన్నారు. లేనిచో కోర్టులను ఆశ్రయించి న్యాయ పోరాటం చేస్తామన్నారు. మరోవైపు యూనివర్సిటీలను స్తంభింపజేస్తామని హెచ్చరించారు. దీనిపై సీఎం సానుకూలంగా ఉన్నప్పటికీ అధికారులు తప్పుడు సంకేతాలు పంపించి కావాలనే సమస్య పరిష్కారం కాకుండా కాలయాపన చేస్తున్నారని వాపోయారు. డా.ఉపేందర్, డా.సనత్, వెంకటేశ్వర్లు, రేష్మారెడ్డి, డా. రాజేంద్రప్రసాద్, అరుణ్, చిరంజీవి, రమేశ్, రామలింగం, తిరుపతి, లింగం, నవీన్ తదితరులు ఉన్నారు.

అనర్హులే అధికం..!

- నిరుపేదల కంటే, ధనికుల వద్దే ఎక్కువగా తెల్ల రేషన్‌కార్డులు
- దళారీల ద్వారా తీసుకుంటున్న ఆహార భద్రత కార్డులు
- అనర్హులను తొలగించాలని పలువురి డిమాండ్



అల్విన్‌కాలనీ: దారిద్ర్యపు రేఖకు దిగువన ఉన్నవారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆహార భద్రత కార్డులు అందిస్తున్నాయి. అయితే కొందరు ధనికులు దళారుల ద్వారా తెల్లరేషన్‌కార్డులు తీసుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాసులకు కక్కుర్తి పడి ఎలాంటి తనిఖీలు చేపట్టకుండానే అనర్హులకు కార్డులు అందిస్తున్నారని అర్హత గలవారు వాపోతున్నారు. గతంలో అనర్హుల తెల్లరేషన్ కార్డు దారులను గుర్తించి తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. దీంతో కొందరిని తొలగించారు. కానీ బాలానగర్, కూకట్‌పల్లి మండల పరిధిలోని కార్డులు రద్దు అయిన వారు మళ్లీ పైరవీల ద్వారా ఆహార భద్రత కార్డులు పొందేందుకు యత్నిస్తున్నారు. విలాసవంతమైన సొంత భవనాలు, కార్లు, లక్షల రూపాయల నగదు, బంగారం ఉన్నవారు పౌర సరఫరాల దుకాణాల వద్ద వేలిముద్ర వేసేందుకు వచ్చినప్పుడు వారిని చూసి పేదలు ముక్కున వేలు వేసుకుంటున్నారు. అన్ని అర్హతలు ఉండి తినడానికి తిండి లేక పస్తులు ఉండే తాము కాళ్ల చెప్పులు అరిగేలా తిరిగితే కానీ రాని తెల్లరేషన్ కార్డు, ధనికులకు మాత్రం వారు కోరుకోగానే ఎలా వస్తున్నదని అధికారులను ప్రశ్నిస్తున్నారు. తెల్ల రేషన్ కార్డు అందించాలంటే సర్వే చేసే బృందానికి మండలాధికారులు, పౌర సరఫరా అధికారులే పర్యవేక్షించాల్సి ఉంటుంది.

సంక్షేమ పథకాలే లక్ష్యంగా..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ పథకాలు అందించేందుకు తెల్ల రేషన్ కార్డులనే ఎక్కువగా ప్రామాణికంగా తీసుకోవడంతో వీటికి డిమాండ్ పెరిగింది. దీనిని ఆసరాగా చేసుకుని కొందరు రాజకీయ నాయకులతో పైరవీలు చేసుకుని, అధికారులకు ముడుపులు ముట్టజెప్పి రేషన్ కార్డు ద్వారా లబ్ధి పొందుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇబ్బడి, ముబ్బడిగా కార్డులు జారీ చేయడంతో రాష్ట్ర ప్రభుత్వానికి కోట్లాది రూపాయలు నష్టం కూడా వాటిల్లుతోంది. దీంతో పాటు పలు ప్రభుత్వ సంక్షేమ పథకాలు కూడా దుర్వినియోగం అవుతున్నాయని, ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ చూపి అనర్హత గల వారికి కాకుండా అర్హులకే ఆహార భద్రత కార్డులు అందేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రద్దు చేయాలి..



పేద ప్రజలకు దక్కాల్సిన తెల్ల రేషన్ కార్డులు పక్కదారి పడుతున్నాయి. ఉన్నవారు, లేనివారు అనేది గుర్తించి అర్హత గల వారికే తెల్లరేషన్ కార్డు అందించాలి. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలో నిరుపేదల కంటే డబ్బు ఉన్నవాళ్ల వద్దనే తెల్ల రేషన్ కార్డులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. పౌర సరఫరా శాఖ అధికారులు వీరిని గుర్తించి అనర్హుల రేషన్ కార్డులు రద్దు చేయాలి.

– కుమార్ యాదవ్, కూకట్‌పల్లి

నిబంధనల మేరకే రేషన్ కార్డు..

తెల్లరేషన్ కార్డుకు సంబంధించి ప్రతిదీ ఆన్‌లైన్ ద్వారానే జరుగుతుంది. ప్రభుత్వ నిబంధలకు విరుద్ధంగా ఇచ్చే వీలు లేదు. ఒకవేళ అనర్హులు దొడ్డిదారిన రేషన్ కార్డు పొందిన, కార్లు, సొంత నివాసాలు, ఎక్కువ ఆదాయం, ఆస్తులు గల వారి ఆధార్ కార్డు లింకు అయి ఉంటే ఆటోమేటిక్‌గానే రేషన్ కార్డు రద్దు అవుతుంది. ఇప్పటికే చాలామంది తమ కార్డు రద్దు అయిందని ఫిర్యాదు చేస్తున్నారు. నేరుగా కంప్యూటర్‌లో మీకు ఉండాల్సిన వాటికంటే ఎక్కువ వనరులు ఉన్నాయి కాబట్టి మీ రేషన్ కార్డు రద్దు అయిందని వారికి తెలియజేస్తున్నాం.

– కల్యాణ్, పౌర సరఫరాల అధికారి, బాలానగర్

బాలానగర్ పోలీసుల ఆధ్వర్యంలో నాకాబందీ



బాలానగర్: సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి ఆదేశాల మేరకు బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం రాత్రి నాకాబందీ నిర్వహించారు. ఈ సందర్భంగా బాలానగర్ డీసీపీ సురేశ్ కుమార్, ఏసీపీ నరేశ్‌రెడ్డి పర్యవేక్షణలో రాజుకాలనీలో దుర్గామాత గుడి రోడ్డు, గౌతమ్‌నగర్, నర్సాపూర్, గుడ్‌మెన్‌పేట్ చౌరస్తాల్లో రాత్రి 11 నుంచి తెల్లవారుజాము 2 గంటల వరకు బాలానగర్ సీఐ నర్సింహారాజు ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. నంబర్ ప్లేట్లు లేని 28 ద్విచక్రవాహనాలు, ఆటోను సీజ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. పాత నేరస్తులను గుర్తించడం, మద్యం, మాదక ద్రవ్యాలు, అక్రమ నగదు బదిలీ, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా పెట్టడం , అంతేగాకుండా మాదకద్రవ్యాలు సేవించిన వారిని గుర్తించడం, ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

‘చలో రాజ్‌భవన్ విజయవంతం చేయండి’



కూకట్‌పల్లి: బీసీ రిజర్వేషన్ల బిల్లుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదముద్ర వేసి రాజ్యాంగంలోని 9 వ షెడ్యూల్‌లో చేర్చాలని కూకట్‌పల్లి సీపీఎం మండల కమిటీ డిమాండ్ చేసింది. శ్రీశ్రీనగర్ కార్యాలయంలో గురువారం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా నాయకులు, మండల కార్యదర్శి ఎం. శంకర్ హాజరై మాట్లాడుతూ.. ఈనెల 18న చలో రాజ్‌భవన్ కార్యక్రమం ఉందని, పార్టీ సభ్యులు, సానుభూతిపరులు, బీసీ మేధావులు, ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి ఎం. శంకర్, సభ్యులు, యు. శివప్రసాద్, పి. ధర్మారావు, ఏ. రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేగౌడ్

ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండ పరిధిలోని రాజీవ్‌గాం . దీనగర్ కాలనీలో సీసీ రోడ్డు పనులను డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ గౌడ్ కాలనీవాసులతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనులు త్వరగా పూర్తి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు. గుడ్ల శ్రీనివాస్, నవీన్, సురేశ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో శాంతిర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ప్రొఫెసర్స్, విద్యార్థులు

బాలానగర్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ వై. పురాణ్‌కుమార్, ఐపీఎస్ ఆత్మహత్యపై తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ జేఎన్‌టీయూహెచ్ హైదరాబాద్‌లో ఎస్సీ, ఎస్టీ సెల్ ‘ర్యాలీ ఫర్ ట్రూత్ అండ్ అకౌంటబిలిటీ’ పేరుతో గురువారం శాంతి ర్యాలీ చేపట్టారు. విద్యార్థులు, సిబ్బంది క్యాంపస్ ప్రధాన ద్వారం నుంచి ప్రారంభించి అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా జేఎన్‌టీయూహెచ్ డైరెక్టర్ డాక్టర్ కె. విజయకుమార్ రెడ్డి మాట్లాడుతూ.. రాజ్యాంగ పదవుల్లోని వారిని ప్రతిఒక్కరూ తప్పనిసరిగా గౌరవించాలన్నారు. జేఎన్‌టీయూహెచ్ రిజిస్ట్రార్ డాక్టర్ కె. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. జేఎన్‌టీయూహెచ్ అడ్మిషన్స్ డైరెక్టర్ బి. బాలునాయక్ మాట్లాడుతూ.. ఈ దాడి రాజ్యాంగ విలువలకు అవమానకరమన్నారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ బి. క్రాంతికిరణ్, డాక్టర్ డి. వసుమతి, డాక్టర్ ఎం. సుష్మ, డాక్టర్ ఇ. రాంజీ, డాక్టర్ ఎల్. సైదానాయక్, బోధనేతర సిబ్బంది, సభ్యులు పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల ఇద్దరి ఆత్మహత్య

కుత్బుల్లాపూర్: అనుమానాస్పదంగా ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుజరాత్‌కు చెందిన గౌతం చరణ్‌షుడీ, ఆనందిత మెహతా (26) భార్యాభర్తలు. వీరి 6 నెలల క్రితం బతుకు దెరువు కోసం నగరానికి వలసవచ్చి పేట్‌బషీరాబాద్‌లోని అపర్ణ గ్రీన్స్ ప్రైసెస్ సమీపంలో లేబర్ కాలనీలో ఉంటున్నారు. ఈనెల 15న ఇంట్లో ఎవరూ లేని సమయంలో అర్ధరాత్రి 11.30 గంటల సమయంలో ఆనందిత మెహతా ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో..

మానసిక సమస్యతో బాధపడుతున్న ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొంపల్లికి చెందిన సాదిక్ మన్సూర్ (45) నిరుద్యోగి. ఇంటి వద్దే ఉంటూ మానసిక సమస్యతో బాధ పడుతున్నాడు. మతిస్థిమితం సరిగా లేకపోవడంతో మానసికంగా కృంగిపోయిన మన్సూర్ గురువారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేన్సర్‌పై అవగాహన ర్యాలీ

బాలానగర్: బోన్ కేన్సర్‌తో 2015లో మరణించిన డిపార్టుమెంట్‌లో బి.టెక్ చదివిన శ్రీ విలాస్ జ్ఞాపకార్థం జేఎన్‌టీయూహెచ్‌లోని యూసీఈఎస్‌టీహెచ్‌లోని ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ (ఈఈఈ) విద్యార్థులు గురువారం ‘విలాస్–2025 పేరిట హాఫ్–డే–మెమోరియల్ గేమ్స్ ఈవెంట్'ను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కేన్సర్‌పై అవగాహన ర్యాలీ తీశారు. ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ కె.హెచ్. ఫణిశ్రీ, డాక్టర్ కె. నాగసుజాత, ఈఈఈ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్రికెట్, వాలీబాల్, త్రోబాల్ పోటీల్లో డిపార్టుమెంట్ అధ్యాపకులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



ర్యాలీలో ఆచార్యులు, విద్యార్థులు

వర్కింగ్ జర్నలిస్ట్‌లకు కార్పొరేట్ వైద్యమందించాలి



కుత్బుల్లాపూర్ నూతన కార్యవర్గం

కుత్బుల్లాపూర్: వర్కింగ్ జర్నలిస్టులకు కార్పొరేట్ వైద్యం అందించేలా ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాలరాజుగౌడ్ డిమాండ్ చేశారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ యూనియన్ సర్వసభ్య సమావేశం, నూతన కమిటీ ఎన్నికలు సూరారంలోని వీవీపీ ఫంక్షన్ హాల్లో గురువారం నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళనలు చేపడుతామని చేస్తామన్నారు. ఐక్యంగా ఉండి సమస్యలను పరిష్కరించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సాయిబాబా, కోశాధికారి శేషారెడ్డి, కుత్బుల్లాపూర్ ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షుడు శేఖర్, వెంకట్, సిరిగిరి శ్రీనివాస్, నాగేంద్ర చారి, సీనియర్ జర్నలిస్టులు రామారావు, అనిల్, గౌస్, లాలయ్య తదితరులు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్ నూతన కమిటీ ఎన్నిక

అధ్యక్షుడిగా గోలిపల్లి దయాకర్ రెడ్డి, కార్య నిర్వాహక అధ్యక్షుడిగా సాయిబాబా, ప్రధాన కార్యదర్శిగా రెడ్డెబోయిన మల్లేశ్‌యాదవ్ ఎన్నికయ్యారు. అలాగే కార్య నిర్వాహక కార్యదర్శులుగా బేరోజు రణదేవ్, శేషారెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా శ్రీనివాస్, ప్రవీణ్, ఎల్లంపల్లి నర్సింహులు, అన్వర్, కోశాధికారిగా శివ శర్మ, సలహాదారులుగా శేఖర్ గుంటూరు, గౌస్ మొయినుద్దీన్, నాగేంద్ర చారి, కె.వెంకట్, లాలయ్య, సిరిగిరి శ్రీనివాస్, కుంట అనిల్, ఉపాధ్యక్షులుగా సీతారామారావు, కలికి మూర్తి, శ్రీధర్, పత్రాల సురేశ్‌గౌడ్, కార్యవర్గ సభ్యులుగా లక్ష్మణ్, సంతోష్,. ఎండీ లియాకత్ అలీ, గ్రంధాలు, నవీన్ రాజు, సంతోష్, నాగబాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఉచిత వైద్య శిబిరాలతో నిరుపేదలకు మేలు

సనత్‌నగర్: ఉచిత వైద్య శిబిరాలతో పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. గురువారం సనత్‌నగర్‌లోని బీకేగూడలో శ్రీనివాస సమాజ సేవా చారిటబుల్ ట్రస్ట్, ఆస్టర్ ప్రైమ్ హాస్పటల్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు పార్థసారధి, బీఆర్‌ఎస్ నాయకులు బాల్‌రెడ్డి, నిర్వాహకులు పార్థసారధి, ఆస్టర్‌ప్రైమ్ హాస్పటల్ వైద్యులు ప్రియాంక, సురేష్, సీనియర్ సిటిజన్స్ సభ్యులు దూబే, మాణిక్ రావుపాటిల్, అనంతరెడ్డి, నాయకులు కరుణాకర్ రెడ్డి, సురేష్‌గౌడ్, ప్రవీణ్‌రెడ్డి, రాజేష్‌ముదిరాజ్, ఖలీల్, అశోక్‌యాదవ్, గోపీలాల్‌చౌహాన్, కూతురు నర్సింహ, కట్టా బలరాం, పీయూష్‌గుప్తా, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

అరకొర నీటి సరఫరాతో అవస్థలు..!

జర్నలిస్టుకాలనీలో నీటి కటకట

నిజాంపేట్ : ‘పేరు గొప్ప.. ఊరు దిబ్బ’ అన్నట్లుగా తయారైంది నిజాంపేట్ జర్నలిస్టు కాలనీ పరిస్థితి. 20 రోజుల క్రితం వరకు నీటి సరఫరా బాగానే జరిగినప్పటికీ ఆ తర్వాత నీటి సరఫరాలో తీవ్ర అంతరాయం కలుగుతోంది. రోజు విడిచి రోజు నీటి సరఫరా చేయాల్సి ఉండగా 4 రోజులకోసారి సరఫరా చేస్తున్నారు. గతంలో ఇక్కడ విధులు నిర్వర్తించిన లైన్‌మెన్ కాలనీవాసుల అవసరాలకు మేరకు నీటిని వదిలేవారు. అయితే 20 రోజుల నుంచి పాత లైన్‌మెన్ స్థానంలో కొత్తవారు రావడంతో వారికి ఏమాత్రం అవగాహన లేదు. ఏ వాల్వ్స్ ఓపెన్‌చేస్తే ఎటువైపు నీరు వెళ్తాయో తెలియడం లేదు. ఫలితంగా కొంతమందికి నీరు వస్తే, మరికొంతమందికి నీటి సరఫరా కావడం లేదు. ఒకవేళ నీరు వచ్చినాలో ప్రెషర్‌తో అరగంట పాటు ఇచ్చి బంద్ చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయంపై జలమండలి సిబ్బందికి పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేదని మండిపడుతున్నారు. ఇప్పటికైనా జలమండలి సిబ్బంది స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలని జర్నలిస్టు కాలనీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ముక్కర్ల లాలయ్య, కాలనీవాసులు కోరుతున్నారు.

విద్యుత్ శాఖ అధికారుల బస్తీబాట



బాలయ్యనగర్‌లో ఏఈ చైతన్యభార్గవ్, సిబ్బంది


సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్‌లో విద్యుత్ శాఖ సిబ్బంది గురువారం బస్తీబాట చేపట్టారు. ఏఈ చైతన్య భార్గవ్ ఆధ్వర్యంలో సిబ్బంది బాలయ్యనగర్‌లోని వీధుల్లో తిరుగుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బస్తీలో త్రీఫేజ్ లైన్ లేక లోఓల్టేజీ సమస్య ఉందని, అదేవిధంగా మీటర్లు సరిగా పనిచేయడం లేదని పలువురు స్థానికులు వారి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఏఈ పరిష్కరిస్తామని హామీనిచ్చారు. బాలయ్యనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేశ్, కమిటీ సభ్యులు ఉన్నారు.

పాటిగడ్డ నివాసితులకు అండగా ఉంటాం

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: రసూల్‌పురా చౌరస్తా నుంచి పాటిగడ్డ మీదుగా నెక్లెస్‌రోడ్డులోని సంజీవయ్య పార్కు వరకు చేపట్టే ఫ్లైఓవర్ నిర్మాణంలో ఆస్తులు కోల్పోయే బేగంపేట పాటిగడ్డ నివాసితులకు న్యాయం జరిగేలా చూస్తానని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ హామీనిచ్చారు. రైల్వేలైన్‌పై నెక్లెస్‌రోడ్డు, పాటిగడ్డ ప్రాంతాన్ని కలుపుతూ 600 మీటర్ల పొడవుతో రూ.80 కోట్ల వ్యయంతో రోడ్డు ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ)ని నిర్మించేందుకు జీహెచ్‌ఎంసీ సిద్ధమైంది. ఈ నేపథ్యంలో నెక్లెస్ రోడ్డు నుంచి పాటిగడ్డలోని మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ వరకు భూసేకరణ ప్రక్రియను మొదలుపెట్టారు. అందులో భాగంగా ఆస్తులు కోల్పోయే వారికి బుధవారం నోటీసులు జారీ చేసిన దృష్ట్యా ఆందోళనకు గురైన పాటిగడ్డ నివాసితులు గురువారం ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యను మొరపెట్టుకున్నారు. తమ ఆస్తులు పోతే పరిస్థితి ఏమిటని, ఇక్కడ ఆస్తిని కోల్పోతే ఎక్కడో ఇస్తారని, తాము ఇక్కడే పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. పాటిగడ్డలోనే ఉన్న ఆర్ అండ్ బీ క్వార్టర్స్ స్థలంలోనే తమ ఆస్తులకు ప్రతిగా స్థలం కేటాయిస్తే బాగుంటుందని వారు కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నేత శేఖర్ ముదిరాజ్ తదితరులున్నారు.

డీసీసీ అధ్యక్ష పదవికి కోట నీలిమా నామినేషన్



జోషికి నామినేషన్ పత్రం అందజేసిన నీలిమా

అమీర్‌పేట: సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవి కోసం సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు కోట నీలిమా గురువారం నామినేషన్ దాఖలు చేశారు. సంఘటన సృజన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సమావేశంలో ఏఐసీసీ పరిశీలకులు సీపీ జోషికి నీలిమా తన నామినేషన్ పత్రాలు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా ముందుకు వెళ్తున్నానని అన్నారు. ప్రజల నుంచి వచ్చిన నాయకత్వాన్ని ప్రజల ద్వారా ఎంపిక చేయడమే దీని ముఖ్య ఉద్దేశమని పత్రికా ప్రకటనలో తెలిపారు.

ఘనంగా అంతర్జాతీయ చెఫ్ వేడుకలు



ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న చెఫ్‌లు

సనత్‌నగర్: ది చెఫ్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో సనత్‌నగర్‌లోని ఆగ్రోమెక్‌లో గురువారం అంతర్జాతీయ చెఫ్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి హాజరైన వంటల నిపుణులు విభిన్న రకాల ఆహార పదార్థాలను, పిండి వంటలను ప్రదర్శించారు. ది చెఫ్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు యాదగిరి, ఉపాధ్యక్షుడు రాజుల పర్యవేక్షణలో జరిగిన ఈ వేడుకలకు ప్రముఖ చెఫ్‌లు కాశీ విశ్వనాధన్, శేఖర్, సంజయ్ తుమ్మ, సుధాకర్, ఫల్గుణి నాయుడు, సుధాకుమార్, అన్మోల్ ప్రభు, కళ్యాణ్ చక్రవర్తి, రవీంద్రరెడ్డి తదితరులు హాజరయ్యారు. రుచిగా, శుచిగా, వినూత్నంగా ఆహార పదార్థాలను తయారుచేసిన వారికి బహుమతులను అందజేశారు.

కార్యకర్తలు సమష్టిగా పని చేయాలి



మాట్లాడుతున్న ఏఐసీసీ అబ్జర్వర్ అంజలి నింబాల్కర్

సుభాష్‌నగర్: కార్యకర్తలు సమష్టిగా పని చేయాలని ఏఐసీసీ అబ్జర్వర్ అంజలి నింబాల్కర్ సూచించారు. జిల్లా అధ్యక్షుల ఎంపిక కోసం నిర్వహిస్తున్న సంఘటన్ శ్రీజన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బహదూర్‌పల్లిలోని మేకల వెంకటేశం ఫంక్షన్ హాల్లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హనుమంత్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. టీపీసీసీ అబ్జర్వర్ సింగాపురం ఇందిరాతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హనుమంత్ రెడ్డి మాట్లాడుతూ.. సీనియర్ నాయకులు, కార్యకర్తల అభిష్టం మేరకు జిల్లా అధ్యక్షులను ఎంపిక చేయడం ఆనందంగా ఉందన్నారు. అంజలి నింబాల్కర్ మాట్లాడుతూ.. కార్యకర్తలు సమష్టిగా పని చేసి రానున్న రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి, కుత్బుల్లాపూర్ బి.బ్లాక్ అధ్యక్షుడు బండి శ్రీనివాస్‌గౌడ్, జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ బొంగునూరి ప్రభాకర్ రెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు లక్ష్మి, సీనియర్ నాయకులు పున్నారెడ్డి, కిశోర్ రెడ్డి, కందడి శివా రెడ్డి, అవిజే జేమ్స్, దమ్మని శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.